


# అచ్చుతప్పులు

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

'ఎక్కడికెళ్ళావమ్మా! నువ్విక్కడ లేకపోతే అర్థమేమారిపోయింది.... దా....దా....' అంటూ కళ్ళు పెద్దవిచేసి 'త' అక్షరాన్ని చేతిలోకితీసుకొని 'ర' పక్కన స్టిక్ కూర్చాడు రామనాథం.

'నువ్వు పరుషానివి. కచటతపల్లో నాలుగో అక్షరానివి. నీకు వ్యక్తిత్వం, ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం అన్నీ వున్నాయి. అయితే నువ్వెక్కడో మారుమూల అసరాలేకుండా వుండిపోతే యెట్లా. నువ్వు యెవరి పక్కన వుండాలో నీకు తెలీటంలా. నువ్వు లేకపోతే చూశావా యేమయిందో 'మహభారం' అయిపోయింది. నువ్వొచ్చావు అంతా వెలుగే. 'మహాభారతం' చూడు ఎంత వ్యత్యాసమో! నీ శక్తి నీకు తెలీటం లేదు.... రామనాథం స్టిక్ అక్షరాలు కూరుస్తూ తనలో తాను కొంచెం బిగ్గరగాను కొంచెం మెల్లిగాను గొణుక్కుంటున్నాడు.


"ఎవరే ఆ గదిలో.... తాతగారు ఎవరితో మాట్లాడుతున్నారు."

'నాకు మాటలు వినిపిస్తున్నాయి. అదే నాకు అర్థంకావటం లేదు. ఇప్పుడేగా నేను కాఫీఇచ్చి వచ్చింది....' ఆలోచనగా అన్నది సునంద.

నువ్వెక్కడున్నావు.... నువ్విట్లా విడిగా పడుంటే నీకు రాణింపు యేముంటుంది చెప్పు....సృష్టిలో ప్రతి వస్తువుకు ప్రయోజనం వుంది. పరమార్థం వుంది. నువ్వు నిన్ను కించపరుచుకుంటే, యితరులు నిన్ను యెట్లా గౌరవిస్తారు చెప్పు? శుభమా అంటూ ప్రారంభోత్సవం చేద్దామని ఆయన గంపెడాశతో వుంటే నువ్విట్లా ఆయన్ను డిజపాయింట్ చేయొచ్చా చెప్పు....'చేతిలోకి 'కొమ్ము' ను తీసుకుని అహ్హహ్హ అంటూ నవ్వుకున్నాడు.

'ఎవరో వున్నారే లోపలలేకపోతే ఆ సంభాషణేమిటి! ఆ నవ్వేమిటి!....తలుపు చాటున నిలబడి వింటున్న వాసుకూడా తన అనుమానాన్ని వెళ్ళబుచ్చాడు.

కట్ ఫేస్ సెంటర్ అనేమాటను తెలుగులో తర్జుమాచేసి 'తుంపులకొట్టు' అని ముచ్చటగా అచ్చువేయమంటే, నువ్వు 'త' కు పక్కన చేరిపోతే యెట్లాగు చెప్పు....' అంటూ ఆ కొమ్మును 'త' కు తగిలించాడు. ఇప్పుడు చూడు; నువ్వు లేకపోతే.



'ఆ కొట్టు ప్రారంభోత్సవం అయిన తరువాత ఒక్కడు అడుగుపెడతాడా!.... ఇప్పుడేమంటావు.... నే చెప్పింది నిజమేనా....' రామనాథం సంతృప్తిగా నిట్టూర్చాడు.

'మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.... కాని లోపలికి వెళ్లితే తాతగారు కోపడతారు. ఆయన కంపోజ్ చేస్తున్న కాసేపు ఎవ్వరూ లోపలికి రాకూడదని ఆయన శాసనం....'

'వెళితే యేమవుతుంది.....'

'ఏంలేదు డిస్టర్బ్అవుతుందని దాని వలన అక్షరాలు తారుమారవుతాయని అంతకంటే యేంలేదు....'

'అమ్మా! ఇప్పుడు చూడు నువ్వెంత అందంగా వున్నావో.... అంటున్నాడే.... ఆ .... అవును.... నేను స్పష్టంగా విన్నాను....'

'తాతగారు ప్రేమాయణంలో పడ్డారే....మో'

'ఏమిటా మాటలు పెద్దా చిన్నా లేకుండా....' శారద కొంచెం కోపంగా చూసింది.

'అమ్మకు కోపం వచ్చింది.... మనం వెళదాం రా....' అంటూవాసు, సునందను పిలిచాడు. ఇద్దరూ కలిసి వెళుతుంటే, శారదకు అనుమానం వేసింది, గదిలో యెవ్వరున్నట్టూ అని.

'ఒరేయ్ వాసు.... తాతగారు యేమి అనరుగాని, గదితలుపు తియ్యి' అన్నది శారద.

'అమ్మో నాకు భయం, అక్కయ్యను తియ్యమను....' వాసు తప్పించుకోవటానికి ప్రయత్నంచేశాడు.

'నిజం తెలుసుకోవడంలో తప్పేమీ లేదు. నిజాన్ని దాస్తే తప్పు ' సునంద పకపక నవ్వింది.

'ఆ అయినట్టే, యిహ తాతగారు దగ్గరకు వెళ్లామంటే యిలాంటి సూక్తులు కొల్లలుకొల్లలు. వినలేక మనకు మతి పోతుంది.' వాసు చేతిలోవున్న ట్రాన్సిస్టర్ వాల్యూమ్ పెంచాడు.

'ఎప్పుడూ వీడికి వివిధభారతే' పనీ పాటాలేదు....' సునంద విసుక్కుంది.

'నువ్వు పుస్తకం పట్టుకుంటే వదిలి పెడతావు! నవలంటే చాలు యెంతచెత్తదయినాసరే అంతా చదివి తీరాల్సిందే....' వాసు తనమీద పడ్డ టను దులిపేశాడు.

సునంద కోరగా తమ్ముడివైపు చూసింది.

'లోపల యెవ్వరూ లేరట్రా.... తాతగారే మాట్లాడుకుంటున్నారు... ఏమిటో పెద్దవాళ్ళు అవుతున్నకొద్దీ యిట్లాగే వుంటుందిగామోలు పరిస్థితి....' అనుకుంది శారద.

రామనాథం నాలుగు కాగితాలు కంపోజ్‌చేసి బాగా అలసిపోయి గదిలోంచి వచ్చేశాడు. వరండాలో కుర్చీలోకూర్చుని కొంచెంగా ఆయాసపడుతున్నాడు.

ఎందుకొచ్చిన అవస్థ. ఈవయస్సులో ఏదో కృష్ణారామా అనుకుంటూ కాలం వెళ్లబుచ్చక, ఈ కంపోజింగ్, ప్రూఫ్ రీడింగ్.... ఈ పేపరు నడపటం.... నాకసలేమీ అర్థంకావటంలా....' సూర్యం తండ్రినిచూసి జాలిపడ్డట్టుగా అనుకున్నాడు.

కాని పైకిమాత్రం యేమీ అనలేదు. అయినా ఆయనతో వాదించి గెలవలేరు. గట్టిగా అంటే, కష్టపడి పనిచెయ్యనినాడు అన్నం తినటానికి సిగ్గుపడాలని మహాత్మా గాంధీ అన్నాడని చెప్పుతారు. ఏమిటో ఆయన తత్వం.... 'సూర్యం తనలో తాను సమాధానపడ్డాడు.

'ఒరేయ్ తాతగార్ని భోజనానికి రమ్మనమను....' అంటూ వాసునిపురమాయించి, సూర్యం లోపలికి వెళ్లాడు.

'అమ్మా....' అంటూనే మధు లోపలికి వచ్చి, శారద చేతులు పట్టుకున్నాడు.

'మళ్లీ ఏదో వరం అడగటానికే యీ యెత్తు....' అన్నది శారద నవ్వుతూ.

'ఇవి చేతులుకావు అను అన్నయ్యా! యీ డైలాగు బాగుంటుంది....' వాసు అందుకున్నాడు.

'నువ్విక్కడే వున్నావు.... ఛా.... అవతలకుపో' సూర్యం కసిరికొట్టాడు.

'ఏంలేదే.... ఇవ్వాళ రాత్రికి ఓ పార్టీ వుంది మాస్నేహితులంతా వస్తున్నారు. సరే నేనెట్లాగో వెళతాననుకో. సుశీలను కూడా తీసుకెళ్లాలని వుంది. నువ్వు ఎట్లాగయినాసరే నాన్నతో చెప్పి పంపించాలి....' నీళ్లు నమిలాడు.

'వెళ్లేది మీరు.... మధ్యనేనుచెప్పటం యెందుకు.... శారద ఒకడుగు ముందుకు వెయ్యబోతుంటే, చప్పున ఆపి 'కాదు కాదు నీకు తెలీదు.... నువ్వారికేనాన్నతో చెప్పు. వాళ్లు యిట్లా వెళదామనుకుంటున్నారని.... ఏదైనా అంటే, పోనీవెళ్లనీయండి యీ పూటకు అను అంతే. అది చాలు....' సూర్యం తెగబతిమాలుకుంటున్నాడు.

ఇదంతా ఓరకంటితో శశిరేఖ గమనిస్తూనేవుంది, గది గుమ్మందగ్గర నిలబడి.

'సరేలే రాత్రిక్కిదా చూద్దాంలే....' దులపరించుకుంటూ శారద వెళ్ళిపోయింది.


సూర్యం తలుపుప్రక్కన నిలబడి వున్న శశిరేఖ మొహంలోకి కొరకొర చూశాడు. శశిరేఖ కూడా అన్నయ్యవంక కోపంగానే చూసింది.

ఆ సాయంత్రం శశిరేఖ, తూర్పు వైపుగదిలో మంచంమీద పడుకుని కిటికీ లోంచి బైటవైపుకు అట్టేచూస్తోంది.

సూర్యం భార్యను వెంటబెట్టుకుని వాకిటిగుమ్మంలోకి వచ్చాడు. శశిరేఖ దభాలున మంచంమీదనుంచి పడుకున్నదల్లా లేచి కూర్చుంది. వాళ్లిద్దరివైపు ఆలోచనగా చూస్తోంది. వాళ్లిద్దరు నవ్వుకుంటూ చరచరా వెళ్ళిపోయారు.

శశిరేఖ తల గిర్రున తిరిగింది.

'శశి శశి'అని యెవరో పిలిచినట్లు విని



పించింది. అమాంతం మంచంమీద నుంచి లేచి నిలబడింది. అటూయిటూ చూసింది. అక్కడ యెవ్వరూలేరు. శరీరంలోకి వణుకొచ్చి ఒక్కసారిగా గజగజలాడింది. తల విదిలించేసుకుంది. కళ్ళు గట్టిగా మూసుకుంది. పెద్దగా నిట్టూరుస్తోంది. కళ్ళు మూసుకోవటం ఆలస్యం శ్రీధర్ కళ్ళల్లోకి వచ్చి కూర్చుంటాడు. కోపంగా. కళ్ళు చప్పున తెరచింది. తీవ్రంగా అటూయిటూ కలయ చూసింది.

ఎవరితో యేవిధంగా ప్రవర్తించాలో, ఏం మాట్లాడాలో నాకు బాగా తెలీదు. అన్నీ తెలిసింది ఆయనకే. ప్రతిదానికి వితండవాదన.... ఆయన చెప్పింది నే వినాలి. నే చెప్పింది యేమాత్రం పట్టించుకోక్కర్లా.... అవును ఆయన పెద్ద ఆఫీసరే కాదం దెవరు! నేను మాత్రం తక్కువేమిటి! నేను ఇంగ్లీషు లెక్చరర్ని. నా క్లాసులోపిన్ డ్రాప్ సైలెన్స్! క్లాసంతా నావైపే చూస్తూ నా లెక్చర్ అయ్యేదాకా అట్లాగే వుండిపోతారు. నేను పాఠం చెప్తున్నప్పుడు చాటుగా కొంత మంది లెక్చరర్స్ కూడా వింటూ వుంటారని సరిత నాకు చెప్పింది.... దానికేమంటారు.... అది నా గొప్పతనంకాదట.... షేక్స్పియర్ నాటకంలో వుండే గొప్పతనంట!.... అయితే 'పార్ డైజ్ లాస్ట్' చెపుతున్నప్పుడుక్లాసులో ఆడపిల్లలుసగం మంది నిద్రపోతు వుంటారని విన్నాను.

ఇది మిల్టన్ పొయిట్రీలో డిఫెక్టు! లేక శోభాదేవి లెక్చర్‌లో లోపమా!.... దీనికి సమాధానం లేదు. నా గొప్పతనం ఒప్పుకోవటానికి యిష్టంలేదు....

ప్రతివాళ్లూ ఏవో సూటిపోటి మాటలు అంటూవుంటమే, వాళ్లకు యింకో పనే లేదల్లేవుంది.... మా యింటో టి.వి. లేదుగా అంటూ నన్ను ఓరకంటతో చూస్తూ నవ్వుతుందా! ఎన్నిగుండెలు.... ఎప్పుడో పెళ్ళిచూపుల కొచ్చినపుడు నేను వాళ్లను మీ యింట్లో టి.వి.వుందా, ఫ్రిజ్‌వుందా అని అడిగాననేగా! ఏం అడిగితే తప్పా! నీకు సంగీతం వచ్చా! ఎం.ఏ. కదా యింట్లో యేమన్నా పని పాటలు చేస్తుందా! అని వాళ్లడగచ్చన్న మాట. దాంట్లో తప్పేమీలేదు. అత్తగారు చూడబోతే ఎంతమాటపడితే అంతమాట అనేసెయ్యటమే.... వెనుకా ముందు ఆలోచించటంలేదు. అవతల వాళ్ళు యెంత బాధపడతారో అనేమాటే లేదు........'

శశిరేఖ వళ్ళు వేడెక్కిపోయింది_ అక్కసుకసి యెక్కువయిపోయినాయి. ఏమయినాసరే నే నెక్కడికీ వెళ్ళను. ఏం యిక్కడ బతకలేనా! అక్కడ కంటే దర్జాగానే వుంటాను. ఈ వారంలో ఏదోఒకటి ఇంటర్‌వ్యూ రాకమానదు.... పోనీ అంతగా రాకపోతే ట్యుటోరియల్ కాలేజీపెట్టి నా తడాఖా యేమిటో చూపిస్తాను....'శశిరేఖ ఊగిసలాడుతూ ఉద్రేక పడుతోంది.

ఎవరో వస్తున్నట్టు అలికిడి విని చప్పున మొహాన్ని పమిటకొంగుతో అద్దుకుని, ముంగురులను పైకినెట్టేసి, అద్దముందు నిలబడి బొట్టు సరిదిద్దుకుంది.

అమ్మాయి అంటూ శారద లోపలికి వచ్చింది.

శశిరేఖ తలలెత్తి తల్లివంక చూసింది.

'ఇదిగో చూడు.... మేము యేదైనా అంటే, యీ డొంకతిరుగుడు మాటలెందుకు.... నేనుంటం మీకు యిష్టం లేదని సూటిగా చెప్పొచ్చుగా అనేస్తావు. అందుకనే నాకు భయం నీతో యేంమాట మాట్లాడాలన్నా.... ఇప్పుడు చూడు అన్నయ్య వదినా యెట్లా వుంటున్నారో! వదినకూడా చదువుకుందేగా....' శారద చెప్పుతూవుంటే శశిరేఖ ఏంమాట్లాడలేదు.

'చూడమ్మా! పట్టుదల అందరికీ వుండాల్సిందే. కాదనను. మూర్ఖత్వం వుండకూడదు.... పట్టువిడుపులు వుండాలంటావా!.... చూసినవాళ్ళు యేమనుకుంటారు చెప్పు....'

'వాళ్ల మాటలు నీ కెందుకు నువ్వేమనుకుంటున్నావో చెప్పు....' శశిరేఖ గఖాలున అన్నది.

'నువ్వు అల్లుడూ కలసిమెలిసి ఒక చోటవుండి కాపురం చెయ్యాలనుకుంటున్నాను. తల్లిగా అంతకంటే నేనేమనుకుంటాను చెప్పు ....' జాలిగా అన్నది శారద.

'నీకు తెలీయదు.... చెప్పితే అర్థం కాదు. నీ కెట్లాచెపితే అర్థంఅవుతుందో నాకు అంతుపట్టటంలేదు....' ఉక్రోషంగా అన్నది శశిరేఖ.

'పెద్ద పెద్దపుస్తకాలే పిల్లలకు అర్థమయ్యేటట్లు చెపుతానంటావు. నాకు అర్థమయ్యేటట్లు నువ్వు చెప్పలేవా!....'

'అదుగో నువ్వు అంతా ఏదో డొంక తిరుగుడు మాటలు మాట్లాడటం....'

'అందుకనే అన్నా యిందాక నీతో మాట్లాడం భయం అని.... ఏమంటున్నా యేవో అర్థాలు తీస్తూనేవుంటావు. నీకదో అలవాటయిపోయింది....'శారద కొంచెం విష్టూరంగానే అన్నది

శశిరేఖ యేమీ సమాధానం చెప్పలేదు.

'అదిగో నాన్న వస్తున్నట్టున్నారు పద వెళదాం....'శారద ముందుకు ఓ అడుగు వేసింది.

'ఎవరులోపల....' వస్తూనే సూర్యం అడిగాడు.

శారద మాట్లాడకుండానే వెళ్లిపోయింది. సూర్యం లోపలికివెళ్ళి తొంగి చూశాడు.

'నువ్వా, ఇక్కడేంచేస్తున్నావు....'

'ఏం లేదు........'

'అల్లుడుమళ్లాయింకోఉత్తరంరాశాడు. ........మన దగ్గరనుంచి ఉత్తరంచూసి బయలుదేరివస్తానని రాశాడు. చిన్నచిన్న విషయాలు మనసులోకి తీసుకుని యింత పట్టుదలగా మీ అమ్మాయి వుండటంయేమీబాగాలేదని నచ్చచెప్పమని రాశాడు....' సూర్యం యింకాముగించక మునుపే, 'అవును నన్ను ఇన్‌సల్ట్ చేయటం చిన్న విషయంగానే వుంటుంది వాళ్లకు,' అన్నది శశిరేఖ తాపీగా.

'మాటమాటకి ఇన్‌సల్ట్ ఇన్‌సల్ట్ అంటావు. ఇంట్లో నలుగురువున్నతర్వాత మాటా మాట అనుకోరా? యీ మాత్రం దానికే నువ్వింత యిదయిపోవాలా.నువ్విక్కడ యెన్నాళ్లున్నా మాకేం కష్టంలేదు ....నీ జీవితం గురించే నే అరాటపడేది కొంచెం ఆవేశంగా' అన్నాడు సూర్యం.

'ఇప్పుడేమయిందని....' శశిరేఖ ఎదురు ప్రశ్న వేసింది.

'ఇప్పుడేం కాలేదులే .... ఇదుగో వుత్తరం....' శశిరేఖకు వుత్తరాన్ని అందించాడు. మెల్లగా వెనక్కుతిరిగాడు.

ఆ రాత్రంతా నిద్రలేదు. తెగ మధన పడింది శశిరేఖ.


'అసలు నేను యిక్కడికి రావలసింది కాదు. పెద్ద పొరపాటే చేశాను. అమ్మా నాన్న నన్ను అర్థంచేసుకుంటారు, ఆదరిస్తారు అనుకున్నాను గాని అనుక్షణం ఏదో విధంగా నన్ను నిరుత్సాహ పరుస్తారని అనుకోలేదు. తీవ్రంగా అసంతృప్తి పడింది.

'ఎట్లాగయినాసరే నాఇండివిడ్యూవాలిటీ యేమిటోవాళ్లకుచూపిస్తాను. నా అంతట నేను స్వశక్తిమీద ఏం చెయ్యగలనో, ఏం సాధించగలనో కూడా వాళ్లకు

అర్థమయ్యేటట్లు చెప్పాలి. అప్పుడుగాని నా ఇంపార్టెన్స్ వాళ్లకు తెలియదు....' తీవ్రంగా ఆలోచిస్తోంది.

రోజులుగడుస్తున్నా తన పట్టుదలలో మాత్రం మార్పు యేమీరాలేదు. శశిరేఖ నిబ్బరంగానూ, గంభీరంగానూ కని పిస్తూనేవుంది.

ఆనాడు రామనాథం పేపరు చదువుతూ పడకకుర్చీలో పడుకున్నాడు. మామూలుగానే టేబుల్‌మీద కొన్ని కాగితాలు పడివున్నాయి.




అచ్చుతప్పులతో వాటిని సరిదిద్దాలి. బద్ధకంగా కొంచెం ముందుకు వరిగి, ఒక కాగితాన్ని చేతిలోకి తీసుకున్నాడు. కళ్లజోడులోంచి అక్షరాన్ని తీవ్రంగా చూస్తున్నాడు. కొన్నింటిని కొట్టేస్తున్నాడు. కొన్నింటిని దిద్దుతున్నాడు. ఇంతలోకి శశిరేఖ కాఫీ తీసుకొచ్చి, కప్పు రామనాథానికి అందించింది. ముభావంగా ఒక్క క్షణం నిలబడి వెనక్కు తిరిగింది.

'శశిరేఖేనా.... అమ్మాయి సమయానికి వచ్చావు.... ఏమన్నా పనిమీద ఉన్నావా. ఈ ప్రూఫ్ కాస్త దిద్దిపెడతావా, ఇవ్వాళ యెందుకో నా కళ్ళు ఆనటంలేదు'.... అన్నాడు రామనాథం....

'అట్లాగేనండి.' అంటూ నవ్వుతూ వినయంగా ఓ కాగితం చేతిలోనికి తీసుకుంది....

'ఆ కుర్చీ ఇటులాకో్క....' అని ప్రూఫ్ యే విధంగా దిద్దాలో టూకీగా చెప్పాడు.

శశిరేఖ ఒరిజినల్ దగ్గరపెట్టుకుని అక్షరం అక్షరం చూస్తూ మరీ దిద్దుతోంది.

'మన వాక్కులో యెంత పటుత్వం, యెంతఅర్థం, యెంత భావం వుంది! ఇదంతా మనం ప్రత్యక్షంగా చూడాలంటే మాట్లాడేమాటలుకాగితంమీదకనిపించాలి. మనవాక్కుకు, అక్షరాలకు యెంతో సన్నిహిత సంబంధం వుంది. ప్రతి అక్షరం మన ఆలోచనలకు ప్రతిరూపం యిస్తుంది. ఈ అక్షరాల్లో అంత మహత్తు వుంది....' రామనాథం చెపుతుంటే, శశిరేఖ ఒక్క క్షణం ప్రూఫ్‌దిద్దటం ఆపి ఆయన మొహంలోకి చూసింది.

'నేను ఎప్పటినుంచో మిమ్మల్ని అడుగుదామనుకుంటాను, కాని సమయం రాలేదు. అడగమంటారా....' అన్నది బెరుకుగా.

"ఇప్పుడు ఆ సమయం వచ్చిందనుకుంటే అడుగు...."

'అదికాదునాఉద్దేశం... మీరేకంపోజ్ చేస్తూ వుంటారెందుకు.... అది మీ డిగ్నిటీకి భంగంఅని నా అభిప్రాయం....

'అసలు కంపోజ్ చెయ్యటమంటే యేమిటో తెలుసుకున్నారా....' అన్నాడు చప్పున.

"నవ్వుమొహంతో ఆయన వంక చూసింది ఏమిటి మరి అన్నట్టు. 'ఏ అక్షరం ఎక్కడ ఉండాలో నిర్దేశించటం, ప్రతి అక్షరానికి ఒక స్థానం అంటూ వుంటుంది. స్థానభ్రష్టత్వం కాకూడదు...."

శశిరేఖ యిట్టే ఉలిక్కిపడింది.

'అందుకనే కంపోజింగ్‌కు అంత ప్రాధాన్యం యిస్తాను, పైగా నేనే స్వయంగా చేస్తుంటే, పనివాళ్లు ఒళ్లు వంచి పనిచేస్తారు. యజమాని పని చేస్తుంటే నౌకరు చూస్తూ కూర్చోడు కదా! అందుకనే అన్ని పనులు నేను స్వయంగా చేస్తూనే వుంటాను. నీ సందేహం నివృత్తి అయిందా?....'

శశిరేఖ మారుమాట్లాడలేదు.

తాను దిద్దిన ప్రూఫ్ కాగితాన్ని ఆయనకిచ్చింది. రామనాథం పైనుంచి క్రిందదాకా ఒక్కసారి చూస్తున్నాడు. మధ్యలో చప్పున ఆపి 'ప్రూఫ్‌దిద్దటం ఏమంత తేలికయిన పనికాదు' అన్నాడు.

'ఏమన్నా తప్పులున్నాయా అండి' అన్నది ఆదుర్దాగా.

'పరువు అనే మాటలో 'ప' అక్షరానికి బదులు 'బ' అక్షరం పడింది. అక్షరాలన్నీ సజీవాలే. ప్రాణంతో కళకళలాడుతూ వుంటాయి, ఈ అక్షరాలకు కొన్ని కట్టుబాట్లు వుంటాయి. ఆ హద్దుల్లోనే సంచరించాలి. విర్రవీగకూడదు. ఎక్కడికి పడితే అక్కడికి పరుగెత్తటానికి వీల్లేదు. ఏ అక్షరం ఎక్కడ వుండాలి, దేనిప్రక్కన నిలబడాలి, ఇది చాలా ముఖ్యం. దాంట్లో యేంతేడా వచ్చినా, ఇప్పుడయినట్లే అభాసు అయిపోతుంది.'పరువు' కాస్తాపోయి 'బరువు' మిగులుతుంది'....రామనాథం కొంచెంగా

ఆవేశపడ్డాడు.

శశిరేఖ ఉక్కిరిబిక్కిరయి పోయింది. కళ్లార్పకుండా ఏదో గంభీరంగా ఆలోచిస్తూ అట్లాగే వుండిపోయింది.

'మన వ్యక్తిత్వం కాపాడుకోవటం మనచేతిలో వుందమ్మా!.... మనల్ని మనం అగౌరవపరుచుకుంటే, యితరులు మనల్ని గౌరవించరు. నువ్వుండాల్సిన చోట వుంటేనే నీకు రాణింపు, మర్యాద అన్నీ దక్కుతాయి. ఉన్నదాన్ని పోగొట్టుకుని లేనిదానికోసం ఆరాటపడుతున్నావు.........'నాన్న యింకా ఏవేవో అన్నాడు. అవన్నీ నన్ను యెద్దేవగ అన్నమాటలే అనుకున్నానుగాని, దాంట్లో అర్థమేమిటో తెలుసుకోలేదు. అయితే నేను చేసింది పొరపాటా!.... తనలో తాను మథపడుతోంది శశిరేఖ.

'ఏదో ఆలోచిస్తున్నట్టున్నావు....'

'అబ్బే ఏంలేదు....'

'నాకు తెలిసిన నాలుకు ముక్కలు యింకోళ్లకు చెపితేగాని,నాకు సంతృప్తి వుండదు. ఇది మొదటినుంచీ నాకు ఓ అలవాటు......... నేనూ రోజూ కాసేపు కంపోజ్‌చేస్తూ, కాసేపు ప్రూఫ్‌దిద్దుతూ వుంటే యెన్నెన్ని ఆలోచనలు, కొత్త భావాలు వస్తాయో అంతులేదు. ఒక్కొక్కప్పుడు తన్మయత్వం చెంది యీ అక్షరాలతో మాట్లాడుతూవుంటా. ఈ అక్షరాలు, గుణింతాలతోనూ వత్తులతోనూ అలంకారం చేసుకుని సర్వాంగసుందరంగా సాక్షాత్కరిస్తాయి. ఒక్కొక్కప్పుడు అవే వెగటుగా కనిపిస్తాయి. బోసిగా కనిపిస్తాయి. చెవులకులోలాకులు ముక్కుకు ముద్దులులేకపోతే ఆడపిల్లలు యెట్లా కనిపిస్తారు. 'త'కు ప్రక్కన వుండాల్సిన కొమ్ము కాస్త మాయమయిపోయింది. దాంతో 'తలా భారం' వచ్చింది.'

శశిరేఖ హాయిగా నవ్వేసింది. హృదయం యెంతో తేలికవుతున్నట్లు అనిపిస్తోంది.

'అందుకనే యీ వత్తులు గుణింతాలు కూడా జాగ్రత్తగా చూడాలి. అటూ యిటూ పోతే అర్థం మారిపోతుంది. నవ్వులపాలయిపోతుంది'....

శశిరేఖ తనచేతిలో కాగితంవైపు చూస్తూ, మొహం చిట్లించింది. ఒకటి రెండుసార్లు చదివినా ఏమీ అంతుపట్టటం లేదు. అక్షరాలు వత్తులూ అన్నీ బాగానే అచ్చయినాయిగాని, చదువుతుంటే అంతా గజిబిజిగా వుంది. రామనాథానికి చూపించింది.ఆయన కళ్లజోడులోంచి తీవ్రంగా చూసి ఎటూ పాలుపోక ఒక్కక్షణం ఆగిపోయాడు.

'చూశావా.... అక్షరాలు అన్నీ వున్నాయి. అయితే పేలవంగా, నిర్జీవంగా, అర్థరహితంగా వెలవెలబోతున్నాయి....ఇందాక చెప్పానే అదే, ఉండాల్సినచోట యే అక్షరమూ లేదు. గుణింతాలు స్వైరవిహారంచేసినాయి.... కేసులో అక్షరాలు క్రిందపడ్డట్టున్నాయి. మనవాడు కాస్తా వాటిని మళ్లా అక్కడా యిక్కడా పేర్చి అచ్చువేశాడు. అంతే....' రామనాథం, ఆ కాగితాన్ని టేబుల్ మీద పెట్టాడు.

శశిరేఖకు యేదో ఆలోచన తళుక్కున మెరిసింది. మొహం విప్పారింది. తాను దిద్దుతున్న ప్రూఫ్ తనకు కొత్త బలాన్ని చేకూర్చినట్లయింది. రామనాథం గారు చెప్పినమాటలన్నీ చెవుల్లో గింగురుమంటున్నాయి. తనలో తాను ఘర్షణ పడుతోంది. తాను వేసుకుంటున్న ప్రశ్నలకు తనకు నచ్చేసమాధాలే వస్తున్నాయి. మెల్లిగా లేచి నిలబడింది. రామనాథం వంక చూసింది.

'మొత్తంమీద నాకు కాస్త హెల్ప్ చేసిపెట్టావు....'అన్నాడు రామనాథం....

అప్రయత్నంగా చప్పునవంగి ఆయన కాళ్లకు నమస్కారం చేసింది. కళ్లు చెమ్మగిలినాయి.

'ఇదేమిటి? లే....ఎందుకూ ఆ కళ్లల్లో నీళ్లు....' గద్గదంగానే అన్నాడు రామనాథం.

ఒకర్నొకరు చూస్తూ నిశ్చలంగా ఓ క్షణం నిలబడిపోయారు. ఆయన కళ్లు తుడుచుకుంటూ 'పిచ్చిపిల్ల' అంటూ ఆమె తలమీద చెయ్యిపెట్టి ఆప్యాయంగా నిమిరాడు.

ఆమె తలవంచుకుని వెనక్కు తిరిగింది.

రామనాథం టేబుల్‌మీద కాగితం చేతిలోకి తీసుకుని పరధ్యానంగా చూశాడు. చప్పున ఆయన రెండు కళ్లూ అక్కడే నిలిచిపోయినాయి.

'శశిరేఖా.... గండిపడింది. ఇది కరెక్ట్ చెయ్యలేదే? 'గడి' అని వుండాలిగా....' అన్నాడు.

అనుకున్నాను మీరు కొట్టేసెయ్యండి అంటూ చకచక ముందుకు నడిచింది.

రామనాథం హాయిగా నవ్వేశాడు.

శశిరేఖను చూస్తూనే, ఏమిటి అమ్మాయి యివ్వాళ చాలా హుషారుగా కనిపిస్తోంది అనుకున్నాడు సూర్యం.

శారదకూడా చప్పున కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది.

'నాన్నా....ఆయనకు ఉత్తరం రాయి రమ్మనమని....నే వెళతాను....' అన్నది శశిరేఖ. పమిటికొంగు కొసలు రెండు చేతుల్లోనూ తిప్పుతూ.

———